తేనెటీగల పెంపకంపై శిక్షణ

అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 6: ఆదివాసీ గిరిజన గ్రామాల్లోని యువతకు ఉపాధి మార్గాన్ని చూపేందుకు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చేందుకు ఐటీడీఏ సమాయత్తమవుతున్నది. పీవో బి.రాహుల్‌ను ఆయన చాంబర్‌లో శుక్రవారం తేనెటీగల పెంపకం కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ లక్ష్మినారాయణమ్మ, హార్టికల్చర్ సైంటిస్ట్ శివ కలిశారు. కొత్తగూడెంలోని గరిమెళ్లపాడు నర్సరీ, హార్టికల్చర్ అభివృద్ధిపై వారు చర్చించారు. గిరిజన గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు తేనెటీగల పెంపకంపై కొత్తగూడెంలో మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వాలని, తయారైన తేనె మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఆసక్తిగల యువకులు ఈ నెల 12వ తేదీ వరకు ఐటీడీఏ కార్యాలయంలో భవిత సెల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఒక ప్రకటనలో పీవో తెలిపారు.

బీఈడీ కళాశాల సందర్శన

బీఈడీ కళాశాలను ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. లైబ్రరీ, ఇతర ల్యాబ్‌లను పరిశీలించారు. లైబ్రరీలో విద్యార్థులతో మాట్లాడారు. టెట్, డీఎస్సీ మెటీరియల్ అందిస్తామని హామీ ఇచ్చారు.

కనీస మద్దతు ధర ఇవ్వాలని వినతి

కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బాధ్యులు

అశ్వారావుపేట, సెప్టెంబర్ 6: ఆయిల్‌పాం రైతులకు కనీస మద్దతు ధర టన్నుకు రూ. 20 వేలు ఇవ్వాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తెలంగాణ ఆయిల్‌పాం ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నూనె దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయడంతో గెలల ధర పడిపోయిందని వివరించారు. ఖమ్మం పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేతృత్వంలో శుక్రవారం కలిశారు. ఆయిల్‌పాం రైతుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. కోకోనట్ రీజనల్ సెంటర్‌ను అశ్వారావుపేటలో ఏర్పాటు చేయాలని, సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఫర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆర్గానిక్ ఫార్మింగ్‌ను మంజూరు చేయాలని కోరారు. రైతు నాయకుడు బండి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 6: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు శుక్రవారం సర్వాంగ స్వర్ణ కవచనాలను ధరింపజేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో నిత్య కల్యాణం నిర్వహించారు.

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

దమ్మపేట, సెప్టెంబర్ 6: దమ్మపేట టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జేసీ(బాలుర) గురుకులం ఫిజిక్స్ లెక్చరర్ 'ఉత్తమ అధ్యాపక' అవార్డును అందుకున్నారు. ఆయనను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ కన్నెకంటి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కన్నమ్మకు నివాళి

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 6: దమ్మపేట మాజీ ఎంపీపీ కోండ్రు కన్నమ్మ అనారోగ్యంతో గురువారం తాళ్లమడ గ్రామంలో మృతిచెందారు. మృతదేహాన్ని మా.ఈ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సందర్శించి నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ రూప్ సింగ్, నాయకులు ధనరాజ్, తాటి అశోక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 6: మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురానికి చెందిన నాగరాజు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వావిలాల నర్సయ్య, మునిగెల శ్రీను, కంపెనీ సుదర్శన్, గుమ్మల రాంబాబు, నాగయ్య, దేవరాజు, సోడా నర్సింహారావు, దామోదర్, వీరన్న సైదులు పాల్గొన్నారు.

డ్రైడే పరిశీలన

చంద్రుగొండ, సెప్టెంబర్ 6: మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో వైద్యారోగ్య శాఖ శుక్రవారం డ్రైడే-ఫ్రైడే నిర్వహించింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కనకం తనూజ పరిశీలించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం, సెప్టెంబర్ 6: దుమ్ముగూడెం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికీ డాక్టర్ పుల్లారెడ్డి వెళ్లారు. పరిసరాలను పరిశీలించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. ఆర్ఎంపీలతో సమావేశమయ్యారు. పరిధికి మించిన వైద్యం చేయొద్దని చెప్పారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 6: ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో ధన్ సింగ్ అన్నారు. ఆయన శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాను పక్కాగా తయారు చేసి, ఈ నెల 13న పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలని అన్నారు. 14 నుంచి 21వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించాలని, 28న ఫొటో ఓటరు జాబితా ప్రకటించాలని చెప్పారు. పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులను కల్పించాలని ఆదేశించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మట్టి గణపయ్యనే పూజిద్దాం

కొత్తగూడెం: మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న కలెక్టర్, అశ్వారావుపేటలో సీఐ కరుణాకర్, కొత్తగూడెం ఎడ్యుకేషన్: మట్టి ప్రతిమలతో విద్యార్థులు

పిలుపునిచ్చిన కలెక్టర్ జితేష్ వి పాటిల్
జిల్లావ్యాప్తంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం/కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని భక్తులకు కలెక్టర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో 2,000 మట్టి వినాయక విగ్రహాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పంపిణీ చేసింది. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో, సింగరేణి పాఠశాల వద్ద శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు.

కొత్తగూడెం సింగరేణి..

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 6: సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదురుగా వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ కత్తుల తరుణ్, సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్ శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ విభాగం జీఎం మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీఎంలు కవితానాయుడు, కే.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఎండీ క్వార్టర్స్‌లో, మెయిన్ హాస్పిటల్ ఏరియాలోలో మట్టి విగ్రహాలను జీఎం (పర్సనల్) సామ్యూల్ సుధాకర్, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ పంపిణీ చేశారు.

ఇల్లెందు రూరల్‌లో..

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 6: సింగరేణి ఉద్యోగులకు శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ పంపిణీ చేశారు.

దుమ్ముగూడెం: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న పూదోట కృష్ణవేణి

అశ్వారావుపేట/అశ్వారావుపేట టౌన్

అశ్వారావుపేట/అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 6: వాసవీ క్లబ్, లయన్స్ క్లబ్ సమకూర్చిన మట్టి విగ్రహాలను సీఐ కరుణాకర్, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకుడు యూఎస్ ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజలకు పంపిణీ చేశారు.

పాల్వంచలో..

పాల్వంచ, సెప్టెంబర్ 6: మున్సిపల్ కార్యాలయంలో మట్టి విగ్రహాల పంపిణీని కమిషనర్ డాకు నాయక్ శుక్రవారం ప్రారంభించారు. బొల్లోరిగూడెం రామాలయం, ఒడ్డుగూడెంలోని ముత్యాలమ్మ గుడి ప్రాంతంలో 1,500 విగ్రహాలను పంపిణీ చేశారు. స్థానిక గాంధీ ఫౌండేషన్ యూత్ బాధ్యులు శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

కొత్తగూడెం అర్బన్‌లో..

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 6: కొత్తగూడెంలోని వివిధ ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో మట్టి వినాయక విగ్రహాలను మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, కమిషనర్ శేషాంజన్ స్వామి పంపిణీ చేశారు.

దమ్మపేటలో..

దమ్మపేట, సెప్టెంబర్ 6: దమ్మపేటలో విగ్రహాలను 'మేము సైతం' సంస్థ సభ్యులు, దమ్మపేట యూత్ బాధ్యులు పంపిణీ చేశారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం, సెప్టెంబరు 6: లోహిత ఫొటో స్టూడియో నిర్వాహకురాలు పూదోట కృష్ణవేణి మట్టి విగ్రహాలను కొనుగోలు చేశారు. వాటిని తన స్టూడియో వద్ద భక్తులకు శుక్రవారం పంపిణీ చేశారు?

సారపాకలో..

సారపాక, సెప్టెంబరు 6: వినాయకచవితి వేడుకలకు మండపాలు సిద్ధమయ్యాయి. 9 రోజుల పాటు భక్తుల పూజలందుకోనున్న బొజ్జగణపయ్యల కోసం ఉత్సవకమిటీలు గ్రామాల్లో మండపాలను సిద్ధం చేసుకున్నారు. కొన్ని రోజులుగా మండపాలకు విద్యుత్ సౌకర్యం, ఇతన అనుమతులను అధికారుల నుంచి నిర్వాహకులు తెచ్చుకున్నారు.

మణుగూరు టౌన్..

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 6: వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రధాన రహదారిపై పత్రి, చిన్న గణనాథుని ప్రతిమలు, పాలవెల్లుల విక్రయాలు జోరందుకోవడంతో పట్టణంలో పండుగ శోభ సంతరించుకుంది. వాడవాడలా వినాయక విగ్రహాల ఏర్పాటుకు భక్తులు కమిటీగా ఏర్పడి మండపాలు ఏర్పాటు చేశారు. నిర్వాహకులు డీఎస్పీ కార్యాలయం నుంచి అనుమతులు పొందారు.

మణుగూరు టౌన్: పత్రి, ప్రతిమలు విక్రయాలు చేస్తున్న దృశ్యం, కొత్తగూడెం సింగరేణిలో సింగరేణి డైరెక్టర్లు, దమ్మపేట: మట్టి ప్రతిమలను అందజేస్తున్న సభ్యులు

పాల్వంచ: విగ్రహాలను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ డాకు నాయక్, పాల్వంచ: విగ్రహాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, అధికారులు

ఆర్థిక సాయం అందజేత

నగదు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 6: మండలంలోని ఉల్వనూరులోగల స్నేహ మెడికల్ షాపులోకి ఇటీవల వరద నీరు చేరింది. మందులు, ఫ్రిజ్, ఫర్నిచర్ తదితరాలు పూర్తిగా పాడయ్యాయి. షాపు ప్రహరీ కూలింది. షాపు యజమాని వెంకన్నకు పట్టణంలోని కెమిస్ట్-డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం జిల్లా ఔషధ తనిఖీ అధికారి సంపత్ కుమార్ ద్వారా రూ.43వేలు అందించారు. మేద రమేట్ల శ్రీనివాసరావు (అధ్యక్షుడు), లక్ష్మణాచారి, రావెళ్ల రవి, పద్దం నర్సింహారావు, గోగుల వెంకన్న, గుండా సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోరం

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 6: సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు 104 మందికి చెక్కులను ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము తదితరులు పాల్గొన్నారు.

సంఘ విద్రోహులపై కఠిన చర్యలు : ఎస్పీ

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 6: ఆదివాసీల అభివృద్ధికి ఆటంటకాలు కలిగిస్తున్న సంఘ విద్రోహులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. అందులో ఇలా ఉంది.. 'జిల్లాలోని కరకగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు ఆదివాసీ సాయుధ మావోయిస్టులు మృతి చెందారు. వీరి చావుకు మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకులదే బాధ్యత. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సురక్షిత ప్రాంతంలో తల దాచుకుంటూ, అమాయకులైన కింది స్థాయి కేడర్‌ను తెలంగాణలో అశాంతి సృష్టించేలా, పోలీసులతో తలపడేలా ఉసిగొల్పుతున్నారు. బలవంతపు వసూళ్లే లక్ష్యంగా మావోయిస్టు పార్టీ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నది. ఆదివాసీ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ఫలాలు, విద్య-వైద్యం వంటి కనీస సదుపాయాలు అందకుండా అడ్డుకుంటున్నారు. ఆదివాసీల జీవితాలతో ఆడుకుంటున్నారు. వారిని బలవంతంగా తమలో చేర్చుకోవడం ద్వారా అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఇలా సంఘ విద్రోహులుగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ఆదుకుంటుంది. మావోయిస్టులతో జనజీవన స్రవంతిలో కలిసి, ప్రశాంత జీవితాన్ని గడపాలి. లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులకు రూ.25లక్షలు, రాష్ట్ర కమిటీ సభ్యులకు రూ.20లక్షలు, జిల్లా కమిటీ సభ్యులకు రూ.8లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4లక్షల చొప్పున పునరావాసం పథకం కింద ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది'.

వార్షిక క్రీడాపోటీలు ప్రారంభం

వెయిట్ లిఫ్టింగ్ చేస్తున్న ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 6: పట్టణంలోని జేకే కాలనీ సీఈఆర్ క్లబ్‌లో వార్షిక క్రీడాపోటీలను సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందించడానికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంట పరిహారం ఇవ్వాలని ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 6: భారీ వర్షాలు-వరదలతో దెబ్బతిన పంటలకు ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్న డిమాండుతో సీపీఎం నాయకులు శుక్రవారం వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏడీఏకు వినతిపత్రం ఇచ్చారు. ఆలేటి కిరణ్‌కుమార్, మన్యం మోహన్‌రావు, తాళ్లూరి కృష్ణ, వాసం రాము, ధరావత్ రాందాస్, కాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను అడ్డుకోవడం మూర్ఖత్వం: దిండిగాల

మాట్లాడుతున్న దిండిగాల రాజేందర్

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 6: ప్రశ్నించే గొంతుకలను అడ్డుకోవాలని చూడటం కాంగ్రెస్ మూర్ఖత్వమేనని బీఆర్ఎస్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ అన్నారు. ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ, ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతున్న వారిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. తెలంగాణ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు అరెస్టు చేసి, ఎనిమిది గంటలపాటు స్టేషన్‌లో నిర్బంధించడాన్ని ఖండించారు. ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతమైతే తెలంగాణ వాదుల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. నాయకులు సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వరరావు, రంగనాథ్, జాఫర్ హుస్సేన్, శ్రీనివాస్, అబ్దుల్ నబి పాల్గొన్నారు.

పెరుగుతున్న 'తాలిపేరు' నీటి మట్టం

చర్ల: తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

చర్ల, సెప్టెంబర్ 6: మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద వస్తున్నది. ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు కొండ వాగులు పొంగుతున్నాయి. శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరింది. రిజర్వాయర్‌లోకి సామర్థ్యానికి మించి నీరు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 24 గేట్లు పూర్తిగా తెరిచి 17,704 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. తాలిపేరు పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 74 మీటర్లు. నీటి మట్టం 69.90 మీటర్లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

కిన్నెరసాని నుంచి 10వేల క్యూసెక్కులు విడుదల

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 6: కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి శుక్రవారం రాత్రి 10వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. కిన్నెరసాని ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో వరద నీరు ప్రాజెక్టులోకి చేరింది. దీని పూర్తి స్థాయి నీటి మట్టం 407 అడుగులు. ఇన్‌ఫ్లో 4,000 క్యూసెక్కులు ఉండడంతో నీటి మట్టం 405.3 అడుగులకు చేరింది. డ్యామ్ సైట్ అధికారులు రెండు గేట్లు ఎత్తి, 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

భద్రాచలం వద్ద తగ్గిన గోదావరి నీటిమట్టం

మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

భద్రాచలం వద్ద తగ్గిన గోదావరి నీటి ప్రవాహం

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 6: ఎగువ నుంచి వరద తగ్గడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 42.2 అడుగుల వద్ద వరద ప్రవహిస్తుండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. రాత్రికి మరింతగా వరద తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పోషణ మాసోత్సవాలు

మాట్లాడుతున్న సీడీపీవో తార

టేకులపల్లి, సెప్టెంబర్ 6: పోషణ్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ మాసోత్సవాలు జరిగాయి. మండలంలోని టేకులపల్లి, సులానగర్ సెక్టార్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో టేకులపల్లి సీడీపీవో కెఎం.తార, సూపర్‌వైజర్లు అనురాధ, నిర్మల, టీచర్లు ఇందిరమ్మ, భద్రమ్మ, పద్మ, పంచాయతీ కార్యదర్శులు పవిత్ర, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో..

అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న సీడీపీవో సలోమీ

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 6: మండలంలోని పెద్దిరెడ్డిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సీడీపీవో సలోమి శుక్రవారం అక్షరాభ్యాసం, అన్నప్రాశన చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో..

మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుశీల

పర్ణశాల, సెప్టెంబర్ 6: మండలంలోని నల్లబెల్లి పంచాయతీలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాన్ని సూపర్‌వైజర్ సుశీల నిర్వహించారు. ఏఎన్ఎం సారిక, అంగన్‌వాడీ టీచర్ జానకమ్మ, ఆశాలు నర్సు, విజయలక్ష్మి, మల్యలక్క పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

పాల్వంచ, సెప్టెంబర్ 6: డ్రైనేజీలో పడిన వ్యక్తి మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని పాలకొయ్యతండాకు చెందిన బోగిని రామారావు(40), బస్టాండ్ సెంటర్‌లోగల క్రీ పాయింట్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. రోజులాగానే శుక్రవారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళుతున్నాడు. మార్గమధ్యంలోగల మురుగు కాలువను చీకట్లో గమనించలేదు. దాని దాటే క్రమంలో డ్రైనేజీలో పడిపోయాడు. అతడిని ఎవరూ గమనించలేదు. ఎప్పటికో పాదచారులు గమనించేసరికే మృతిచెందాడు. ఆయన భార్య మాధవి ఫిర్యాదుతో పట్టణ ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఐదుగురు పేకాట జూదరుల అరెస్ట్

జూలూరుపాడు, సెప్టెంబర్ 6: ఐదుగురు పేకాట జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రాణా ప్రతాప్ తెలిపిన వివరాలు.. మండలంలోని వెంగన్నపాలెం గ్రామ శివారులో గురువారం రాత్రి కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.6,700 స్వాధీనపర్చుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9న ఐటీఐ అప్రెంటిస్ మేళా

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 6: ఐటీఐ ఉత్తీర్ణులైన అన్ని ట్రేడ్ అభ్యర్థులకు జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో అప్రెంటిస్ ట్రైనింగ్‌కు ఈ నెల 9న స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 'ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా' ఉంటుంది. ఐటీఐ నోడల్ ఆఫీసర్ రమేష్ ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఉపకార వేతన దరఖాస్తులకు ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 6: 2024-25 సంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి.అనసూర్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థులు వెబ్‌సైట్‌లో డిసెంబర్ 31 నాటికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

పాల్వంచ, సెప్టెంబర్ 6: తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీనిపై వారు వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు రెండు సార్లు రాతపూర్వకంగా మొర పెట్టుకున్నప్పటికీ స్పందన లేదు. మూడోసారి వినతిపత్రం, సమ్మె నోటీస్ ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే, స్థానిక హాస్పిటల్ సూపరింటెండెంట్ రాంప్రసాద్‌కు శుక్రవారం సమ్మె నోటీస్ ఇచ్చారు.

వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్యేకు వినతి

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 6: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలోని కాంట్రాక్ట్ కార్మికులకు బకాయి వేతనాలను కాంట్రాక్టర్ వెంటనే చెల్లించేలా చూడాలని కోరుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. సదరు కాంట్రాక్టర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని చెప్పారు. నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు, సుజాత, లక్ష్మి, శ్రీను, సుమలత, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ


విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

సారపాక, సెప్టెంబరు 6: ఇటీవల కురిసిన వర్షాలకు ముసలిమడుగు, సందెళ్ల రామాపురం పరిధిలోని పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, మరి కొన్ని విరిగిపడ్డాయి. శుక్రవారం సారపాక క్లస్టర్ పరిధిలోని ఏఈ గుర్రం ఉపేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఏఎల్ఎం ప్రసాద్, ఎల్లం వెంకట్రావు, జేఎల్ఎం శ్రీను, శ్యామ్ పాల్గొన్నారు.